రచనలకు ఆహ్వానం

విశాలాంధ్ర 'సాహితి' పేజీలో ప్రచురణార్థం రచనలను ఆహ్వానిస్తున్నాం. ప్రగతిశీల అంశాలతో కూడిన వ్యాసాలు, విమర్శలు, సమకాలీన సాహిత్య ధోరణులపై విశ్లేషణలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, సమీక్షలు పంపవచ్చు. రచనలను ఈ మెయిల్‌లో కూడా అందజేయవచ్చు. అయితే కాపీలను పేజీమేకర్ ఫైల్‌తో పాటు పిడిఎఫ్‌గా మార్చి పంపాలి. వ్యాసాల నిడివి మరీ పెద్దగా ఉండకూడదు. రచయిత పూర్తి చిరునామా, ఫోన్‌నెంబర్ ఈ-మెయిల్ అడ్రసు జతచేయాలి. **రచనలు పంపాల్సిన చిరునామా:** ఎడిటర్, సాహిత్యానుబంధం, విశాలాంధ్ర దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావురోడ్ (చుట్టుగుంట), మాచవరం (పోస్టు), విజయవాడ-520004. ఫోన్: 0866-2430220, ఫాక్స్ : 0866-2431780 email: **sundayvisalaandhra@gmail.com**

సాహితి

సాహిత్యసాహసి - మానవీయ పిపాసి...గురజాడ

సర్వ మానవ శ్రేయోభిలాషి..
ఒక మానవీయ పిపాసి
ఒక సాహిత్య సాహసి
ఒక అద్వితీయ మానవతామూర్తి...

మన గురజాడ..తన తుదిశ్వాస వరకు మన కోసం..మన తెలుగుజాతి కోసం..భావితరాల కోసం అంతులేని అపురూపమైన, అమూల్యమైన సాహిత్య నిధిని ఇచ్చిపోయారు. ఆ మహత్తర మానవీయ జీవన సూత్రాలను అంతఃశోషణము చేసుకోలేక మనం అధోగతిలో పయనిస్తున్నాము. ఇదిమన అజ్ఞానాంధకారానికి తార్కాణం. మహాకవి గురజాడ మరణించి నవంబరు-30, 2015కి నూరు సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఆయన ముందు చూపునుగాని, విజ్ఞతను గాని కాస్తంతయినా అర్థం చేసుకున్నామా..? - అని మనల్ని మనం ప్రశ్నించు కుంటూ ప్రక్షాళన చేసుకునే సమయం ఆసన్నమయింది.

"ఐయామ్ ఎ మ్యాన్ అండ్ నథింగ్ హ్యూమన్ ఈజ్ ఫారిన్‌టుమి." అని టెరెన్స్- రోమన్ నాటకకర్త అన్నట్లుగా - "మానవ సమాజం పట్ల నాకొక మహత్తరమైన బాధ్యత ఉంది". అని గురజాడ ప్రకటించుకున్నారు.

అంతే కాకుండా తాను జీవించిన ప్రతిక్షణం..దాని కోసమే పాటుపడ్డాడు. బ్రాహ్మణుడై ఉండి బ్రాహ్మణ జీవితాల్ని, మడి, ఆచారాలు, సంస్కృతి ముసుగులో జరుగుతున్న అనేకానేక అన్యాయాలను బట్టబయలు చేసాడని, ఆ వర్గం వారికి గురజాడపైన చెప్పలేనంత ఆగ్రహం, ఆక్రోశం ఉన్నప్పటికి సాహసి గురజాడ లెక్కచెయ్యలేదు. సామాజిక పరిణామానికే నడుం బిగించాడు.

"తెలుగు కవిత్వంలో నేను కొత్త ప్రయోగం ఆరంభించాను. నా ముత్యాలసరాల రీతిని మీరు గమనించినట్లయితే మీకే విషయం బోధపడుతుంది." అని గురజాడ ఒక లేఖలో వ్యక్తీకరించి తన సత్తాను తానే చాటుకున్న సాహసి మన గురజాడ. అందుకే శ్రీశ్రీ గురజాడే తన గురువని..అతని జాడే తన అడుగుజాడ -అని నిర్ద్వంద్వంగా, నిక్కచ్చిగా నొక్కి వక్కాణించి ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి యావత్తు తెలుగుజాతిని ఉలిక్కిపడేలా చేశాడు.

చాలా ఏళ్ళుగా భారతీయ సమాజంలో కొన్ని వర్గాల వారు మాత్రమే అభివృద్ధి చెందుతూ, తమ పబ్బం గడుపుకుంటూ మిగతా సామాజిక వర్గాలను ఎదుగు బొదుగు లేకుండా చేశారు. మేడిపండు లాంటి సమాజాన్ని పొట్టవిప్పి బహిర్గతం చేశాడు. 'కన్యాశుల్కం' అనే గొప్ప నాటకంలో గురజాడ. ఈ "కన్యాశుల్కం" అనే చిన్న మొలకను (1892) మహామహా వృక్షంగా మెరుగులు దిద్ది (1909)- ప్రపంచ నాటకరంగ పీఠికపై మహా వటవృక్షంగా నిలిచేటట్టు చేసి- మన తెలుగుజాతిని కనీవినీ ఎరుగని రీతిలో చరితార్థులను చేశాడు మన గురజాడ. ఆ ఒక్క నాటకమే యావత్తు ప్రపంచం- మన తెలుగుజాతిని గుర్తించే 'ఇండికాఫర్' గా మలచాడు. అంతేకాదు తనకు తన ఉనికికి కారణమైన తనకు అండాదండా అయిన పూసపాటి ఆనందగజపతి పేరు ప్రఖ్యాతులు చరిత్రలో శాశ్వతంగా లిఖించాడు. మన గురజాడ శ్రీశ్రీ అన్నట్లుగా "మహానుభావుడు" మన తెలుగుజాతికి ఇంకొక 'గురజాడ' పుట్టిన వరకు- మనకు గురజాడే సాహిత్య గురువు..పెద్దదిక్కు ఇది నిజం...

ఎందుకంటే?-" ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును/ ప్రేమ నిలిపిన ప్రేమనిలుచును" అనే మహత్తర మానవీయ జీవన సూత్రం రెండుముక్కలలో అతిసూక్ష్మంగా, సూటిగా, సొగసుగా, సాటిలేని మేటిగా, ఎటువంటి డొంక తిరుగుళ్ళు లేకుండా తేల్చిపారేశాడు. నిజమే కదా! "గివ్ అండ్ టేక్" అంటాం. తిరిగి ఇవ్వాలి. ఏమీ ఇవ్వకుండా- స్త్రీలను అనేక రకాలుగా హింసించి మరమనుషులగా మార్చి, ఇంటి చాకిరి మాత్రం చేసే బానిసలుగా చూసే అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు, రామప్పంతులు వంటి నరరూప పిశాచాలకు బాగా గడ్డి తినిపించిన సాహసి మన గురజాడ. అంతేకాదు ఎంత ధైర్యవంతుడంటే- సుమారు 115 సంవత్సరాల క్రితమే కాంగ్రెస్‌లో భేదాభిప్రాయాలు గమనించి "పాడవోయ్ కవీ! కాంగ్రెస్ ఒక/ భజన సమాజం-మాత్రమే అనీ/ మితవాదులు నేర్చే గుణపాఠం/ ఏ ఎండల కాయా గొడుగులు!/ కాదని బరిదిగి తిరగబడితివో/ ద్వీపాంతరమే! లేదిక తిరగుడు..." అని సాహసోపేతంగా ధంకా బజాయించి ఆ రోజుల్లో అనగల్గేదంటే అర్థకుడైన మన గురజాడ 'గుండె ధైర్యం' మెచ్చుకుని తీరవలసిందే. నొప్పించక, తానొవ్వక తప్పించుకు తిరుగుతూ తమ పబ్బం గడుపుకుంటున్న సాహితీమిత్రులకు ఒక జీవిత పాఠంగా నేర్పాలి.

మహారాజా ఆనందగజపతిగారి కోటలో దివాన్గిరి చేస్తూనే..కన్యకలో "పట్టమేలే రాజుగర్వం/ మట్టి

గలిసెను... కోటపేటలు/కూలి, నక్కల కాటపట్టె/ అమరె-అని వ్యాఖ్యానించాడంటే గురజాడలోని నిర్మొహమాటం, నిఖార్సయినా సాహసానికి ఒక కొలబద్ద. అందుకే గురజాడ అప్పటికీ, ఎప్పటికీ ఒక సాహిత్య యోధుడు. గురువుగారిచ్చిన ధైర్యంతోనే శిష్యుడు శ్రీశ్రీ ఒక అనువాద కవితలో (1951 హరింధ్రనాథ ఛటోపాధ్యాయ రాసిన) తన సాహసాన్ని ఈ విధంగా ఆవిష్కరించారు.

"అదిమిపట్టి బెదరగొట్టి అందర్నీ పాలించలేరు.
నోరునొక్కి కాలతొక్కి జనాన్ని శాసించలేరు
పెద్దపెద్ద వాళ్ళంతా గద్దె మీది వాళ్ళంతా
శ్రద్ధబూని వినడానికి చేస్తూన్ననీ హెచ్చరిక
హింసవల్ల పీడనవల్ల హీనహేయ మాయవల్ల
గ్రామాలకి గ్రామాలను గాయంచేయడం వల్ల
నిరంకుశల పాలన నేలరాలడం తథ్యం. తిరుగులేని ఈ సత్యం చరిత్ర చెప్పే పాఠం. అని శ్రీశ్రీ గురువుగారి అడుగుజాడల్లో తన నిరసన తీవ్రాతితీవ్రంగా ప్రకటించిన సాహసి శ్రీశ్రీ. "మీపేరేమిటి?" కథలో మన దేవుళ్ళందరి గురించి, ఆ పీనుగులందర్నీ ఒకచోటే పెట్టి పూజించవచ్చు గదా" అని ఒకపాత్ర చేత అనిపిస్తాడు గురజాడ. ఆయన సాహసాన్ని, ధృడచిత్తాన్ని వర్ణించడం ఎవరికి సాధ్యం..?!

బంకించంద్ర ఛటర్జీ రాసిన "వందేమాతరం" గీతాన్ని గురించి తన స్నేహితుడు గిడుగు రామ్మూర్తితో అన్న మాటలు- పెద్ద కొండలు, నదులు, వృక్షాలు, నా మాతలు- ఇవా ప్రజలకు ధైర్య సాహసాలు, ఉత్తేజమూ కలిగించేవి? అని వ్యంగ్య ధోరణిలో ప్రశ్నించే సత్తా ఒక గురజాడకే ఉంది.

నిజమే చెట్లు, పుట్టలు, నదుల పేర్లతో వర్ణనలతో నిండి ఉన్న దేశభక్తి గీతాలు ఏవిధంగానూ మన యువశక్తిని నవశక్తిని చైతన్యవంతం చేయలేవు.

"వెనుక చూసిన కార్యమేమోయ్
మందగించక ముందుకడుగేయ్
వెనుక పడితే వెనుకేనోయ్.." అని ముచ్చటగా మూడే మూడు మహత్తర వాక్యాలుతో యువతకు ఒక్క ఉదుటున ఉరకలు పరుగులు పెట్టించి కార్యోన్ముఖులను చేయగల్గే శక్తి గురజాడ సాహిత్యానికి ఉంది. ఎవరికైనా రస్సా చెప్పి ఇట్టే పట్టీకొట్టించే ఆషాఢభూతి గిరీశంకి- కుక్క కాటుకి చెప్పుదెబ్బ- చందంగా నాటకం చివరికి 'కథ అడ్డం తిరిగేలా' అభాసుపాలు చేసిన గురజాడ బహునేర్పరి. అంతేకాదు మానవ జీవితంతో తను చెలగాటం ఆడటం లేనేలేదని ఘంటాపథంగా చెప్పకనే చెప్పాడు మన గురజాడ.

ఎందుకంటే?- అమాయకురాలైన బుచ్చమ్మను లోబరుచుకోవడానికి పైలాపచ్చీసు గిరీశం పన్నిన పన్నాగాల ప్రసంగాల పరంపరలో కపటి గిరీశంతో ఇలా అన్పిస్తాడు: నిన్ను తలుచుకుని తలుచుకుని నిద్దర పట్టక రెండు ఝామల రాత్రప్పుడు గదిలో యీజీ చెయిరు మీద కూచుని ఉండగా యదట బల్ల మీద దీపం, గోడని నిలువుటద్దం ఉన్నాయి. ఆ అద్దంలో నాముఖం చూసుకుని యేమంటానా? "యీ సొగసైన ముఖం, యీ తామర రేకుల వంటి నేత్రాలు, యీ సోగమీసాలు, యివన్నీ వృధా గదా? యవరు చూసి ఆనందించనూ? నా బుచ్చమ్మ, నన్ను పెళ్ళాడక పోయిన తరువాత నా బతుకుయెందుకు? అని నిస్పృహ కలిగి చర్రున టేబులు సొరుగు తీసి, అందులో ఉన్న జోడుగుళ్ళ పిస్తోలు యెక్కుబెట్టి గుండె దూసిపోయేటట్టు కొట్టేసుకుంటా"- ఇదీ గిరీశం పాత్ర వైఖరి. మన గురజాడ సృష్టించిన మాయదారి గిరీశం పాత్ర ఇటువంటి మాయాబజార్ సమాజం నుండి స్త్రీ తన్ను తాను రక్షించుకోవడానికి- తను వ్రాయబోయే నవల 'సౌదామిని' కోసం నోట్స్ గిరీశాలను గుర్తించి స్త్రీ ఎలా ఎదుర్కోవాలో ఇలా వ్రాసుకున్నారు: స్త్రీ తన అందాన్ని కాపాడుకోవాలంటే సైకిల్ తొక్కాలి. గుర్రపుస్వారీ చెయ్యాలి. పురుషునికి బుద్ధి మాంద్యం, క్రూరత్వం ఉన్నాయి. గనుక స్త్రీ ఖడ్గవిద్య నేర్చుకోవాలి. బయటకు వెళ్ళే సమయంలో ప్రతి స్త్రీకి ఆయుధం ఉండాలి (రివాల్వరు, బాకు)..ఇవి ఆ సాహిత్య సాహసవీరుని కలలు. ఇంత సాహసోపేతమైన సృజనను 120 సంవత్సరాల క్రితం రాస్తే మనం జయంతులు, వర్ధంతుల నాడు మాత్రమే ప్రసంగాలకు పరిమితం చేస్తున్నాం. ఇది జాతి క్షమించలేని నేరం.

ఎల్లలు లేని మానవతావాదముతో ఐక్యరాజ్యసమితిలో పెట్టడానికి అర్హత కల్గిన ఒకేఒక 'విశ్వగీతాన్ని' రాసి మన తెలుగుజాతి సాహిత్య స్థాయిని ప్రపంచ వినీలాకాశంలో ఎగురవేశాడు. అతి సంక్లిష్టమైన వర్తమాన జీవిత పోకడలను విస్మరించి పుక్కిట పురాణ గాథలతో కాలహరణం చేస్తూన్న రచయితలను తూర్పారబట్టాడు. "వేదాంతం పేరుతో మనదేశంలో యెంత వంచన, యెంత మూర్ఖత్వం సాగుతుందో..." అని తన ధిక్కారాన్ని వెల్లడించడమే కాక- "మతములన్నీ మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అని కుండబద్దలు గొట్టి మరీ చెప్పాడు.

"ఈ దేశంలో పాండవులు ఉండని గుహలు, సీతమ్మ వారు స్నానమాడని గుంటలు లేవు" అని సునిశతంగా తనదైన ప్రత్యేక హాస్య వ్యంగ్య ధోరణిలో వ్యాఖ్యానించాడు ఆ సాహసి.

ఎంత చెప్పినా, ఏమి చెప్పినా చెవిటివాని చెవిలో శంఖం ఊదిన చందంగా మన మూర్ఖపు మస్తిష్కాలకు ఎక్కడంలేదు. ఈ తెలుగు నేలపై గురజాడ విజనరీ సాహిత్యం బూడిదపై పోసిన పన్నీరులా వ్యర్థం అయిపోతోంది. ఏమైనప్పటికీ- ఆ మానవీయ పిపాసిని ఆయన జయంతి సందర్భంగా తలచుకుని పరవశిద్దాం. ఎందుకంటే?- "మానవుని ప్రేమించడమన్నది అతి సాధారణమైన జీవిత సూత్రం..యితరులను ప్రేమించడం వల్ల మానవునికి నిరవధిక ఆనందం సిద్ధిస్తుంది" అన్న గురజాడ-

నిజంగా..నిజంగా..నిజంగా
సర్వ మానవ శ్రేయోభిలాషి..
ఒక మానవీయ పిపాసి..
ఒక సాహిత్య సాహసి..

(సెప్టెంబరు-21 గురజాడ జయంతి సందర్భంగా)

-పత్తి సుమతి, సెల్: 8790499405

అభ్యుదయపాటలో...విద్యార్థి, యువత

భావి భారతపు భాగ్య విధాతలు విద్యార్థులు, యువజనం. ఉన్నత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగల శక్తి వీరిది. అయితే ఈనాడు విద్యార్థి చదువుకునే రోజుల్లోనే ప్రక్కదారి పడుతున్నాడు. అడ్డదారుల్లో నడుస్తున్నాడు. అనేక రుగ్మతల్ని ఒంట పట్టించుకుంటున్నాడు. భవిష్యత్తులో ఎందుకు కొరగానివాడిగా సమాజపు హేళనకు, అవమానాలకు గురిఅవుతున్నాడు. సమాజంలో గౌరవాన్ని కోల్పోయి సంఘవిద్రోహశక్తులుగా కూడా మారడం మనం నిత్యం పత్రికల్లో చూస్తూనే వున్నాం. విద్యార్థి దశలోనే ఉన్నత భావాలు, లక్ష్యాలు, దశ, దిశానిర్దేశాలు ప్రతి విద్యార్థి నిర్దేశించుకోవాల్సిన అవసరాన్ని అనేక అభ్యుదయ గీతాలు గుర్తుచేస్తూనే ఉన్నాయి. అప్పుడే అనుకున్న లక్ష్యాల్ని చేరుకోగలుగుతాం!

ప్రతి విద్యార్థి చదువును నిర్లక్ష్యం చేయరాదు. అసలైన చదువు ఎలా ఉంటుంది అనేది ఈ అభ్యుదయ గీతం వివరిస్తుంది.

"చదువెందుకు చదువెందుకు చదువువెందుకురా
నలుగురిలో దీపమై వెలిగేందుకురా
రాజకీయం, రాజకీయం మనకెందుకురా
న్యాయానికి ప్రాణంగా నిలిచేందుకురా...." అంటూ సాగే గీతం చదువు అందించే విజ్ఞానాన్ని సమాజ భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించడం ఎలా అనే అంశాల్ని 'లలితానంద్' ఎంతో దూరదృష్టితో మార్గనిర్దేశనం చేశాడు.

నేడు విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయింది. విద్య సేవలరంగం నుండి తప్పించబడి వ్యాపార రంగంగా గుర్తించబడుతోంది. విద్య వ్యాపార వస్తువైపోయింది. ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకుంటోంది. ప్రయివేటు విద్యా సంస్థల చేతుల్లో విద్య అమ్ముడుపోతుంది. సమాజంలో అందరికీ విద్య అందుబాటులో లేకుండాపోతుంది. ఈ నేపథ్యంలో విద్యారంగంలో వస్తున్న ఈ విపరీత పరిణామాల్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనావుంది. విద్యార్థులు సంఘటితం కావాలి. విద్యను ప్రజలందరి ప్రాథమిక హక్కుగా నిలబెట్టేందుకు కూటమి గట్టాలి అని సాగే ఈ అభ్యుదయ గీతాన్ని చూద్దాం

" కులం మతం కుత్సితాలు
కుళ్ళివున్న ఈ సంఘపు
కూకటేళ్ళ పెకలించె
కూటమిరా ఫెడరేషన్ - కూటమిరా ఫెడరేషన్
విద్యార్థుల తోడునీడ - విజయానికి అడుగుజాడ
వికసించే అభ్యుదయం - వినిపించే సందేశం,
ఉన్నతమగు ఆశయాల - ఉత్తమమగు దృక్పథాల
ఉత్తేజిత ఉద్యమాల - ఊపిరిరా ఫెడరేషన్..." అంటూ నవయుగాలు సంకేతాన్ని, విద్యార్థుల శక్తిని, విప్లవ ఆవశ్యకతల్ని విద్యార్థిలోకానికి అందించింది ఈ గీతం. సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించమని కోరుతోంది. అటువైపు దారి చూపుతోంది.

ఏ దేశం అభివృద్ధి సాధించాలన్నా, ప్రగతి పథంలో పయనించాలన్నా ఆదేశంలోని యువత పాత్ర అత్యంత కీలకం, ఇటువంటి యువశక్తి మన దేశానికి పుష్కలంగా వుంది. ఈరోజు ప్రపంచమంతా మన దేశ సహాయ సహకారాలకోసం ఎదురు చూస్తోంది. అందుకే యువత తమలోని నైపుణ్యాలను వెలికితీయాల్సిన సమయం ఇది. ఇది సాధ్యమే. అప్పుడే ప్రపంచంలో మన దేశం అగ్రగామిగా నిలుస్తుంది. అయితే ఈనాటి యువశక్తి విరుద్ధ భావాలతో దర్శనమిస్తోంది. ఎలాంటి శక్తులు మన సమాజానికి హాని చేస్తాయి. ఎలాంటి శక్తులు సమాజాన్ని ముందుకు నడిపిస్తాయో 'శ్రీశ్రీ' రాసిన ఈ అభ్యుదయ గీతంలో చూడవచ్చు.

"కొంత మంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు
పేర్లకి, పకీర్లకీ, పుకార్లకీ నిబద్ధులు ....." అంటూ సాగే గీతంలో సమాజగమనాన్ని ఆపుతున్న యువశక్తి ఎలా ఉంటుందంటే కళలన్నా, కవితన్నా వీళ్ళకు గిట్టదు. గోల చేయడం, అరవడం వీళ్ళకే చేతనవుతుంది. తాతగారి, భామ్మగారి భావాలకు దాసులు, నేటి నిజం చూడలేని సన్యాసులు వీళ్ళు అంటూ తీవ్ర స్వరంతో వీరి పోకడల్ని నిరసించాడు. వీరిని అవగుణాల కుప్పలుగా, మొద్దురాతి చిప్పలు, నూతిలోని కప్పలు అంటూ ఆక్షేపించడం వెనక ఎంతో ఆవేదన దర్శనమిస్తుంది.

ఈ నేపథ్యంలో నుండి ఆశాజనకంగా ఉన్న యువత మారాల్సిన అవసరాన్ని, వారికి ఉండాల్సిన ఉన్నత భావాల్ని, లక్ష్యాల్ని నిర్దేశిస్తూ ఇదే గీతంలోనే

"కొంత మంది యువకులు ముందు యుగం దూతలు
పావన నవ జీవన బృంధావన నిర్మాతలు
..." అంటూ వీరు బానిస పంథాలను తలవంచి అనుకరించరు అని, పోనీ అని అన్యాయాన్ని సహించరని, గతకాలపు మితవాదాన్ని సమర్థించరని, స్వార్థానికి లొంగిపోయి తమ ఆశయాల్ని పణంగా పెట్టరని తను ఎలాంటి యువ సమాజాన్ని కోరుకుంటున్నాడో తెలియ చేశాడు. వీరందరూ సంఘటితం కావాలని వారందరికీ ఆహ్వానం చెబుతూ వీరికి 'లాల్ సలామ్' అంటూ సాగిన ఈ గీతం యువశక్తి ఎంతటి ప్రాధాన్యతను సంతరించుకున్నదో తెలియ చేస్తుంది.

శ్రీశ్రీ గీతానికి కొనసాగింపుగా అన్నట్లు, సమసమాజ స్థాపనకోసం యువత ఉద్యమ స్వరూపాన్ని దాల్చాల్సిన అవసరాన్ని, సాధించాల్సిన అంశాల్ని, తొలగించాల్సిన రుగ్మతల్ని కలగలిపి 'చైతన్య ప్రసాద్' రాసిన యువతరమా మేలుకో అంటూ సాగే గీతంలో...

"యువతరమా మేలుకో - మగత నిద్రమానుకో
నవతరమా మేలుకో - సమరానికి సాగిపో
ఈ కట్లు తెంచాలి - చీకట్లు తుంచాలి
శోకాల ఈలోకాన - వెలుగు పూలు పూయించాలి
పిడికిళ్ళు బిగబట్టి - బరిలోన తొడగొట్టి
నవలోకం సాధిద్దాం రా ....." అంటూ యువశక్తిని మేలు కొలుపుతున్న ఈ గీతం వెనుక ఉన్నది అభ్యుదయ సమాజపు స్థాపనే కదా!

"మారాలి మనసమాజమూ - మార్చాలి మనమందరము"..... అంటూ గొంతెత్తి పిలుస్తూ.. సమాజంలో నిరుద్యోగం, నిరాశలు నిండి ఉన్నాయి. కష్టజీవుల రక్తం పెట్టుబడిదారులకు భుక్తి అవుతూ ఉంది. స్వార్థ పూరిత సమాజం నిర్మితమైంది. ప్రజాస్వామ్యం పేర జరుగుతున్న అకృత్యాలు, అన్యాయాలు, ఒక వైపు, ప్రజలకు చెందాల్సినవి చెందకుండా అడ్డుపడుతున్న రాబందులు ఒకవైపు, కన్పిస్తున్నాయి. కుల, మత భేదాలు, ప్రాంతీయ తత్వాలు ప్రబలుతున్నాయి అంటూ సమాజం క్షీణ దశను గుర్తుచేస్తూ ప్రజలందరూ మారాలి, మారాలి - మార్చాలి, మార్చాలి అంటూ ముందుకు సాగతూనే ఉంది.

ఈ విధంగా సమాజంలో మార్పుకోరుకుంటూ అభ్యుదయ పాట వస్తూనే ఉంది. ప్రజలందరినీ సంఘటితం కమ్మంటూనే వుంది. తాడిత, పీడిత, కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థి, యువజన శక్తులు సమాజ గమనంపై లోతుగా ఆలోచించాల్సిన అవసరాన్ని, సుభిక్షమైన సమాజాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తూనే వుంది.

-డా॥. సి.యన్.క్షేత్రపాల్‌రెడ్డి

దుఃఖసేతువు

అలా వెళ్ళి ప్రపంచాన్ని చూసొద్దాం
నడుస్తున్నంత సేపూ పలకరింపుల వర్షంలో తడిసి
బతుకు బండిని లాగుతున్న జీవితాల సవ్వడి వింటూ
జీవన్మరణ పోరాటాల చిత్రాల్ని స్పర్శించి వద్దాం
దగ్గరవుతున్న ఆకాశాన్ని దూరంగానే పలకరించి
పరిమళిస్తున్న పువ్వుల సౌందర్యాన్ని చూద్దాం
నదీ అలల నురుగు మీద నడకని కొనసాగించి
గాయపడ్డ బతుకు పాటల్ని ఆలపించే కంఠాల్ని విందాం
నడుస్తున్నంతమేరా రహదారులు విచ్చుకుంటూనే ఉంటాయి
వెల్తురు చీకట్ల దోబూచులాట కూడా కన్పిస్తుంది
నువ్వు నీనుంచి విడిపోయే శబ్దం కూడా విన్పిస్తుంది
రేపోసారి ఒకేరంగు పులుముకున్న పంటపొలాల మీద నడుద్దాం
నీభాష ఎదుటివాడికి అర్థమవక పోయినా ఫర్వాలేదు
దుఃఖసంతోషాలది ఏ భాషలోనయినా ఒకే అర్థమే
దుఃఖంతో ముడుచుకున్న గుండె దేవరాగంతో మేల్కొంటుంది
నీవు నడిస్తేనే కదా కొంతకాలానికి దుఃఖసేతువు కూలేది
నడిస్తేనే కదా ఆత్మీయస్పర్శల ఆలింగన అనుభూతి కలిగేది
ప్రపంచాన్ని చూస్తున్నంతసేపూ..అలా ప్రేమిస్తూనే ఉండు
ఇదో దుర్నార్ధ వ్యవస్థ అంటావు..నిజమే..కానీ
మరణించిన వాడికి మల్లే నీవూ ఉంటే ఎలా?
ఒక సుదీర్ఘ మరణంలోంచి నిన్ను నీవు లేవనెత్తుకోవాలి
కలల్నీ కన్నీళ్ళనీ విత్తనాలు చేసి
ఈ ప్రపంచ పొలంలో చల్లుతూ సంచరించాలి
ఒక స్వప్నాన్ని సజీవం చేసుకోవాలంటే
మరొక జీవస్వప్నాన్ని అలంకరించుకోవాలంటే
మనం నడవాలి..దానికో ప్రపంచం కావాలి
దిగులు గుహల రహస్యాల్ని శోధించాలంటే
ఈ ప్రపంచమనే రంగస్థలం ఎంతో అవసరం
నువ్వనుకున్నదే ప్రపంచం కాదు
నువ్వనుభవించినదీ ప్రపంచంలోనిదెన్నటికీ కాదు
అది నీలోంచి నీవు నీకై పొందినదే..
హృదయ రూపాల రంగులు చీకటిలో కన్పించవు
దేహం లోపలి హృదయతంత్రుల శబ్దాన్ని
మార్మికంగా ఈ ప్రపంచానికి విన్పించు
నువ్వు అనుభవిస్తున్న నాలుగుగోడలు ప్రపంచం కాదు
నువు అనుభవించాల్సిన నిజజీవితమే నీ ప్రపంచం.

-ఖాదర్‌షరీఫ్ షేక్

పట్నంబోయిన పల్లె

పాతికేళ్ళ నాడే మా పల్లె కన్నెపై నగరం కన్నేసింది..
పదేళ్ళనాడే మా పల్లెతల్లి పట్నంబోయింది
నగరం చిన్నది నాజూగ్గా నడుం తిప్పుతుంటే
పిల్లోళ్ళ సదువులని సాకుజెప్పి
పెద్దోళ్ళంతా పట్నం పూడ్సినారు..
కార్పోరేట్ కుర్రది వయ్యారంగా కవ్విస్తుంటే
కంప్యూటర్ విద్యలంటూ
కుర్రతనం కార్పోరేట్ జాలరి చేతులో ఎర్లైయి పూడ్సినారు..
ఇల్లంతా శుభ్రం చేసుకొని
మూలన పడేసిన పొరక్కట్టాలా
ముసలీ ముతక నిట్టూర్పుల దుప్పట్లు కప్పుకొని
ఆముదం అడుగంటిన ప్రమిదల్లో వొత్తుల్లా
మిన్కు మిన్కుమంటూ
పొదనీడల చెట్లకింద వడగాలులై పోయినారు..
రాగిచేను కాడ కూనిరాగాలు పాడుతూ
రాజాలా బతికిన రైతన్న
కనికట్టు కలిమి వడ్డిస్తున్న భోగాలకు
ఖరీదైన హోటళ్ళ ముందు కాపలాగాడై పోయినాడు
మూటా ముల్లె సర్దుకుని ఆటోలోనో, లారీలోనో...
బతుకుని పోగేసుకుని పోయిన మాపల్లె జనం
ఏసిగదుల్లోనో, మురికివాడల్లోనో ఇరుకు బతుకులీడుస్తూ
వాడి మార్కెట్లో సరుకులైనారు..
గొడ్డూగోదా పిల్లాజల్లా..పచ్చని పందిరిలాంటి పల్లె
పూటకూళ్ళ పెద్దమ్మ తిత్తెలా మూలుగుతూ
నిండుగా కలుజుపారే మా ఊరి చెరువు
వట్టిపోయి కొట్టిమిట్టాడుతున్నాయ్..
పొద్దన్నే ఎలబారిపోయిన బిడ్డలు
చీకటిపడ్డా గూటికి రాలేదని ఎదురుచూసే ఎందరో అమ్మల్లా...!
కుంకిపోతున్న సూర్యుణ్ణి కళ్ళల్లో పెట్టుకుని
తూలుతున్న చూపుల్తో, పాలిపోయిన దేహంతో
పట్నంబోయిన పల్లె కోసరం...
మమకారం చావని ఈ మట్టివి
ఎడతెగని ఎదురుచూపు..ఎండమావి ఆశలు..

-పల్లిపట్టు నాగరాజు